# పరిపూర్ణ విడుదల

ఆధ్యాత్మిక మాసపత్రిక

అర్పణ : 27 ఏప్రియల్ : 2026 విడుదల : 8

**"మూడు గంటలకు యేసు ఎలోయీ, ఎలోయీ,**
**లామా సబక్తానీ అని బిగ్గరగా కేక వేసెను;**
**ఆ మాటలకు నా దేవా, నా దేవా,**
**నన్ను ఎందుకు చెయ్యివిడిచితివని అర్థము"**

**-మార్కు 15:34.**

# పరిపూర్ణ విడుదల

ఎడిటర్ : బ్రదర్ దీవెనయ్య

ఏప్రియల్ - 2026

సంవత్సరపు సభ్యత్వ చందా: రూ.150/- , విడి ప్రతి : 15/-


## విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | ఎడిటర్ అర్పణ | 3-5 |
| 2. | రాటుతేలిన ఆత్మీయత | 6-7 |
| 3. | దేవుని మీద ఆధారపడుట | 8-10 |
| 4. | ఆత్మల జాలరి | 11 |
| 5. | ఏకాంత ప్రార్థన ప్రాముఖ్యత | 12-15 |
| 6. | నమ్మిక | 16-17 |
| 7. | దేవుని వాక్యమునకున్న శక్తి | 18-19 |


**సంపూర్ణ రాత్రి ఉపవాస ప్రార్థన**

**ప్రతి నెల 1 వ తేది**

సమయం: రాత్రి గం॥ 9.00

స్థలము: **హోలీమినిస్ట్రీస్ ప్రార్థనా మందిరము**

**బుడంపాడు, గుంటూరు**

# ఎడిటర్ అర్పణ

***మన రక్షకుడైన యేసుప్రభువు నామములో మీ అందరికి నా హృదయపూర్వక వందనములు తెలియజేయుచున్నాను.***

**"మూడు గంటలకు యేసు ఎలోయీ, ఎలోయీ, లామా సబక్తానీ అని బిగ్గరగా కేక వేసెను; ఆ మాటలకు నా దేవా, నా దేవా, నన్ను ఎందుకు చెయ్యివిడిచితివని అర్థము"** మార్కు 15:34.

యేసుప్రభువు పాపులను రక్షించుట కొరకు శాపగ్రస్తమైన సిలువ మార్గమును ఎంచుకొనెను. ఆయన మనపాపముల కొరకు సిలువ వేయబడి ఆకాశమునకు భూమికి మధ్యలో వ్రేలాడెను. అప్పటికే సమస్త మానవాళియొక్క పాపములు కొరడా దెబ్బలై ఆయన దేహమును రక్తసిక్తము చేసెను. సొగసైనను సురూపమైనను లేక మనుష్యులు చూడనొల్లనివానిగా మారెను. మన బలహీనతలను వ్యాధులను వ్యసనములను కల్వరి సిలువలో భరించుచు అమూల్యమైన ఏడు మాటలను పలికెను. అందులో "నా దేవా, నా దేవా నన్నెందుకు చెయ్యి విడిచితివి?" అని ఎప్పుడును పలుకనటువంటి మాట పలికెను. ఆయన తండ్రితో అంతకుముందెన్నడును ఈలాగున మాట్లాడలేదు. ఆయన సాక్షాత్తు దేవుని కుమారుడు. మరొక కోణములో మనము చూచినప్పుడు ఆయన మనుష్యుని పోలికగా పుట్టి దాసుని స్వరూపమును ధరించుకొనెను. "నన్నెందుకు చెయ్యి విడిచితివి?" అని పలుకబడిన ఈ మాటలో ఆయన ఒంటరిగా విడువబడుటను మనము చూడగలము. కొన్నిసార్లు మన పరిస్థితులను చూచినప్పుడు దేవుడు చెయ్యి విడిచిపెట్టారా? మనలను మర్చిపోయారా? అన్నట్లుగా ఉంటాయి. కాని "యుగసమాప్తి వరకు సదాకాలము నేను మీతో కూడా ఉంటాను" అని ఆయన వాగ్దానము చేసెను. ఆయన మాట తప్పని దేవుడు.

మీ పరిస్థితులు కూడా ఈ రోజు ఈ విధముగా కనిపిస్తూ ఉన్నాయా? యేసు ప్రభువుకు కలిగిన ఒంటరితనము పరిస్థితులను మనము

గమనించుదాము. ప్రభువు సేవలో ఆయనవలె నమ్మకస్థులుగా తయారు చేయబడిన సేవకులు లేక శిష్యులు కనబడుటలేదు. ప్రభువు వలన అనేకమైన మేలులుపొందిన తరువాత నమ్మకముగా ఆయనను వెంబడించేవారు కనబడుటలేదు. ప్రభువు మూడున్నర సంవత్సరములు పగలు రాత్రి నిర్విరామముగా సేవ చేసినను ఆయన ఆశించిన ఫలములు కనబడలేదు. ప్రభువు దాహమునకు నీళ్ళు అడిగితే చేదు చిరకను ఇచ్చెను మరియు తన సొంత కుటుంబికులే ఆయనయందు విశ్వాసముంచలేదు. సిలువలో వ్రేలాడుచున్న ప్రభువునకు పరిస్థితులన్నియు వ్యతిరేఖముగానే ఉండెను. పరిస్థితులనుబట్టి ప్రభువు ఆ మాట పలుకలేదు గాని తండ్రితో యెడబాటును తట్టుకొనలేక నన్నెందుకు చెయ్యి విడిచితివి అనే మాటను పలికెను.

ప్రభువు నాతో ఉంటే నా ప్రార్థన ఆయన వింటూ ఉంటే నా జీవితములో ఎందుకు ఇలాగు జరుగుతుంది అని నీకు అనిపించి ఉండవచ్చు. నీకు ఎదురవుతున్న పరిస్థితులను చూచినప్పుడు నీకంటే ముందు ప్రభువు ఆ శ్రమను అనుభవించారని, ఎటువంటి శోధనలో ఆయన ప్రవేశించినను ఏ పాపము లేక పరిస్థితులన్నింటిని జయించి నమ్మకముగా తండ్రి చిత్తము చేసెనని జ్ఞాపకము చేసికొనుము. సిలువలో ప్రభువు ఏలియాను పిలుస్తున్నారని అందరును అనుకొనెను. యేసుప్రభువు ఉన్నటువంటి పరిస్థితి ఆయనను చూస్తున్న వారికి అర్థము కాలేదు. నీ పరిస్థితులను చూచినప్పుడు నీ భర్తకు, నీ పిల్లలకు, నీ తోబుట్టువులకు కూడా అర్థము కావు అయితే ప్రభువు మాత్రమే నిన్ను పరిపూర్ణముగా అర్థము చేసికొనగలరు.

ఇక్కడ మరొక విషయాన్ని మనము గమనించుదాము. **“నా దేవా, నా దేవా, నీవు నన్నేల విడనాడితివి? నన్ను రక్షింపక నా ఆర్తధ్వని వినక నీవేల దూరముగా నున్నావు?”** కీర్తన 22:1. కీర్తనాకారుడు “నన్నేల విడనాడితివి?” అని దేవుని సన్నిధిలో ప్రార్థన చేసెను. నీ జీవితములో నీవు నూతనముగా రక్షింపబడి దేవుని మందిరమునకు వస్తూ ఉన్నను లేక అభిషేకింపబడిన వ్యక్తివైనను, దేవుని సేవలో వాడబడుతూ ఉన్నను నీ యెదుట

ఉన్నటువంటి పరిస్థితులను నీవు చూచినప్పుడు దేవుడు నన్ను విడిచిపెట్టాడా? దేవుడు నా ప్రార్ధన వినడము లేదా? అన్నట్లుగా ఉంటాయి. అయితే నీవు నేర్చుకొనవలసినది ‘‘నీ ఆత్మీయ జీవిత ప్రయాణములో ప్రభువుతో సహవాసమును, పరిశుద్ధతను కాపాడుకొనుటయే.

ప్రియులారా! పరిస్థితి ఏదైనను అపవాదికి చోటివ్వక సిలువలో మనకొరకు సమస్తమును జయించిన యేసువైపు చూడవలెను. ప్రార్ధనలో ప్రభువునకు సమీపముగా వెళ్లిన యెడల సమాధానము నీకు దొరుకును. శోధనను శ్రమను అపహాస్యమును అవమానమును జయించేశక్తి దొరుకును. యుగసమాప్తివరకు సదాకాలము మీతో కూడా ఉంటానని చెప్పిన ప్రభువు యొక్క కృప అన్నింటిలో మనకు విజయమును అనుగ్రహించి అంతమువరకు నడిపించును గాక!

**–ఎడిటర్**

**విత్తనం నేలలో పడిన వెంటనే కనిపించదు. అలాగే దేవుని వాక్యము కూడా మన హృదయములో పడినప్పుడు వెంటనే మార్పు కనిపించకపోవచ్చు. కాని అది నిశ్శబ్దంగా, లోతుగా పనిచేస్తుంది. మనుష్యుల మాటలు, పరిస్థితులు అనుభవాలు మనలను నిరాశకు నెట్టవచ్చు. కాని దేవుని వాక్యము ఉన్నచోట నిరాశకు చోటుండదు. ఎందుకంటే దేవుని వాక్యము విత్తబడిన జీవితం ఎండిపోదు; అది ఆలస్యమైన ఆశ పూలతో తప్పక వికసిస్తుంది.**

# రాటుదేలిన ఆత్మీయత

**"అప్పుడు పెద్ద తుపాను రేగెను"** మార్కు 4:37

జీవితంలో కొన్ని కొన్ని తుపానులు హఠాత్తుగా వస్తాయి. ఓ గొప్ప ఆవేదన, భయంకరమైన నిరాశ, లేక అణగదొక్కేసే అపజయం. కొన్ని క్రమ క్రమంగా వస్తాయి. అవి దూరాన కనిపించే మనిషి చెయ్యంత మేఘంలా ప్రారంభమై, ఇది చిన్నదే కదా అని అనుకుంటుండగానే ఆకాశమంతా కమ్ముకొని మనలను ముంచెత్తుతుంది.

అయితే ఇలాంటి తుపాను వేళల్లో దేవుడు మనలను సేవకు సిద్ధపరుస్తాడు. దేవుడికో దేవదారు వృక్షం అవసరమైతే ఆయన దాన్ని మైదానంలో నాటుతాడు. పెనుగాలులు దాన్ని వణికిస్తాయి. వర్షం దాన్ని మర్ధిస్తుంది. ఈ పోరాటల్లోనే ఆ చెట్టుకి కావలసిన చేవను అది సంపాదించుకొని అరణ్యం మొత్తానికే రాజవుతుంది.

దేవుడు ఒక మనిషిని ఎన్నుకున్నప్పుడు ఆయన అతన్ని తుపానులో నిలబెడతాడు. మనిషి మగతనం సంపాదించుకోవడం చాలా కఠినమైన పరీక్షలతో కూడుకొని ఉంటుంది. మనిషి ఎవడూ తుపానుకు ఎదురు నిలిచి గెలవకుండా మనిషి అనిపించుకోలేడు. ప్రభూ నన్ను పగులగొట్టు తిరిగి నీ చేతులతో తయారుచెయ్యి అని తాను చేసిన ప్రార్థన సార్థకం కాకుండా ఎవడూ పునీతుడు కాలేడు.

ఒక ఫ్రెంచి కళాకారుడు తన అపార మేధాశక్తి ఉపయోగించి ఒక చిత్రాన్ని గీసాడు. ఆ బొమ్మల్లో గొప్ప గొప్ప వేదాంతులు, అమర వీరులు, ప్రపంచములో అన్ని రంగాల్లోనూ ప్రఖ్యాతిగాంచిన మహామహులంతా ఉన్నారు. అయితే ఆ చిత్రం ప్రత్యేకత ఏమిటంటే వాళ్ళు విశ్వవిఖ్యాతి చెందడానికి ముందు కష్టాల్లో ఆరితేరినవాళ్ళు ఆ బొమ్మలో అందరికంటే ముందుగా వాగ్దానంవల్ల వారసత్వంగా లభించిన కనానుకి చేరలేకపోయిన

మోషే ఉన్నాడు. అతని ప్రక్కన తడుములాడుతూ కళ్ళులేని హోమర్ మిల్టన్ ఉన్నారు. వీళ్ళందరి ప్రక్కన అందరికంటే ఉన్నతుడిగా కనిపిస్తున్న మరొక వ్యక్తి ఉన్నాడు. ఆయన ముఖంలో వీరెవ్వరి ముఖంలోనూ కనిపించని బాధ కనిపిస్తున్నది. ఆ కళాకండానికి 'తుపాను' అనే పేరు సరిగ్గా సరిపోతుంది.

తుపాను తరువాతే ప్రకృతిలోని అసలు అందం బయటపడుతుంది. పర్వతానికి ఉన్న కరకు సౌందర్యం తుపాను సమయంలో కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. అలాగే మనుషుల్లో మహాత్ములైన వాళ్ళ జీవితాన్ని తుపానుల తాకిడికి రాటుదేలినదే.

నీ జీవితంలో కూడా పెనుగాలులు వీచి (విసిరి) నిన్ను అటూ ఇటూ కొట్టినై, వాటన్నిటివలన నీవు పగిలిపోయి అలిసిపోయి లోయలో మట్టి కరిచావా, లేక ఆ పెనుగాలులు నిన్ను మరింత మెరుగుపెట్టి నీ వ్యక్తిత్వాన్ని ఔన్నత్యాన్ని సంపాదించి పెట్టినాయా. తుపాను తాకిడులకు అలసి సొలసి ఉన్నవాళ్ళంటే సానుభూతిని నీలో రేకెత్తించినాయా?

దేవుడు నాటిన వృక్షాన్ని
నీ ప్రభంజనమూ సృజించలేదు
గాలిరేగినా కొమ్మలూగినా
ఆ చెట్టుమాత్రం
మరింతపట్టు
భూమి లోతుల్లో వేరుతన్నే
మహా భూజంగా
దేవుడి పోషణలో
అది శాఖోపశాఖలై పల్లవిస్తుంది

ప్రభువు గుర్తించే పాదసాన్ని
కదిలించే తుపాను లేదు
ఉరుములు మెరుపులు
వడిగా కురిసిన పిడుగులు సవ్వడి
ఎంత రేగినా ఏమికాదు
దేవుడు నాటిన
దివ్య వృక్షము
నిలకడగా ఉంటుంది
నిత్యం పుష్పిస్తుంది

## దేవుని మీద ఆధారపడుట

**"యెహోవా నా శైలము, నా కోట, నన్ను రక్షించువాడు నా కేడెము, నా రక్షణ శృంగము, నా ఉన్నత దుర్గము నా దేవుడు నేను ఆశ్రయించియున్న నా దుర్గము"** కీర్తన 18:2. దేవుడే దావీదుకు ఆధారము. దావీదు నలుబది దేశములకు చక్రవర్తియైనను, యుద్ధ నైపుణ్యము కలిగినవాడైనను, జ్ఞానము కలిగిన వ్యక్తియైనను, ఎన్నో తలాంతులు దావీదుకు ఉన్నను దావీదుకు దేవుడే ఆధారము. మన ఆధారము దేవుడే అయినప్పుడు మన జీవితములలో ఎన్ని పోరాటములు వచ్చినను వాటన్నింటిలో దేవుడు మనకు జయమును ఇస్తారు. దావీదుకు ఎక్కడ అవమానము కలిగినదో అక్కడే రెట్టింపు ఘనతను దేవుడు ఇచ్చారు. మన మనవులన్నియు ఆలకించే దేవుని మనము కలిగియున్నాము. ఆయనను ఆధారముగా చేసుకొంటే శత్రువుని జయించుటకు మనకు శక్తినిస్తారు. దావీదు సింహాన్ని, ఎలుగుబంటిని చీల్చాడు. గొల్యాతుని జయించాడు. సౌలును, అబ్షాలోమును, అహీతోపెలును, షిమీని జయించగలిగాడు. వీటన్నింటికి దావీదు ఆధారము దేవుడే. అందుకే దావీదు నీవే నా ఆధారము, నీవే నా రక్షణ శృంగము నా తల ఎత్తువాడవు నీవే, నా అతిశయాస్పదము నీవే నా దాగుచోటు నీవే అని పాడుకొన్నాడు. కాబట్టి మన దైనందిన జీవితములో మన చదువు, ఉద్యోగము కాదు దేవుడే ఆధారమై ఉండాలి. మనలో కొంతమందికి ప్రభువా నేను ఉద్యోగము చేసుకుంటూ మిషనరీ పరిచర్య చేస్తాను అని ఆలోచన వస్తుంది. ఒకవేళ ప్రభువు చెప్పినట్లయితే అలా చేయాలి. కాని అదే ఆలోచనతో మిషనరీ పరిచర్య కొరకై రాకూడదు. మన చిత్తమును సిలువకు అప్పగించి ఖాళీ హృదయముతో పరిచర్యకు వెళ్ళాలి. అప్పుడే దేవుడు దానిని దీవెనకరముగా చేస్తారు.

ఎమీకార్ మైఖేల్‌కు భారతదేశము వెళ్ళుము అని దేవుడు చెప్పినప్పుడు ఆమె ప్రార్థన చేసుకొనెను. ఆమెకు ఎలా వెళ్ళాలో తెలియదు గనుక మిషనరీ

సొసైటివారికి లెటర్ పెట్టుకొన్నారు. వారు భారతదేశమునకు వెళ్ళు అని చెప్పారు. దేవుని ఆత్మతో నడిచినది కాబట్టి దేవుడు గొప్ప జయమును ఇచ్చెను. ఆ దినములలో వచ్చిన కరువు కాలములో ద్వారములన్నియు మూసివేయబడినను ఆమె దేవుని మాట మీద ఆధారపడి దేవుని చిత్తమును నెరవేర్చెను. ఆ కరువులోనే ఎమీకార్ మైఖేల్‌తో ప్రభువు నీవు కొంత భూమిని కొనుమని చెప్పెను. ఆ దినములలో భూమి ధరలు చాలా ఎక్కువగా ఉండెను. ఆమె ఆ విషయమై ప్రార్థన చేసినప్పుడు దేవుడు ఆమెతో ఆ ధరలు ఆకాశములో ఉన్నను నేను క్రిందికి దించుతాను అని చెప్పెను. ఆ కరువు కలుగుట వలన అందరూ చాలా తక్కువ ధరకు భూములను అమ్ముట మొదలు పెట్టిరి. ఒకేసారి అరువది ఎకరములు తీసుకొనగలిగే కృప దేవుడు ఆమెకు అనుగ్రహించెను. ఎమీకార్ మైఖేల్ ఎంతో విశ్వాసముతో ప్రార్థన చేసి దేవుని మీద ఆధారపడి ప్రభువు వైపు చూసినప్పుడు దేవుని గొప్ప కార్యములను చూచుటకు కృపనిచ్చారు. ఆమె ఒంటరిగా భారతదేశమునకు వచ్చినప్పుడు ఆమె ఏమి చేయగలదు అని అందరు అనుకున్నారు. అయితే జిమ్మిఎలియట్ బృందములో ఉన్న ఒక సహోదరుని భార్య ఎమీకార్ మైఖేల్ జీవితమును సవాల్‌గా తీసుకొని ఈక్విడార్‌లో ఆక్వాజాతి ప్రజల మధ్య తన భర్త హతసాక్షి అయినను మరలా ఆక్వా ప్రజలు కొరకై ఈక్విడార్‌కి మిషనరీగా వెళ్ళెను. మన జీవితమును దేవునికి ఇచ్చిన తరువాత మన కంటికి కనిపించని మరియు చెవికి వినబడని హృదయమునకు గోచరము కాని కార్యములు ప్రభువు మన జీవితములో చేస్తారు. అన్నింటికంటే శ్రేష్టమైనది దేవుని మిషనరీ పరిచర్య. మిషనరీ పరిచర్య విలువలు మరియు మాధుర్యము తెలిస్తే ఎవరూ కూడా ఆ పరిచర్య వదిలిపెట్టరు. ఆ పరిచర్య కొరకై దేవునితో సన్నిహిత సంబంధమును కలిగి నశించిపోతున్న ప్రజల కొరకైన ఆకలితో, దేవుని చిత్తము కొరకైన ఆశ హృదయంలో మండుతుంటే వారిని ఎవరు ఆపగలుగుతారు? దేనికి కూడా ఆ శక్తి లేదు.

యెహోషువ తన జీవితములో దేవుని మీద ఆధారపడెను. యుద్ధ సమయములో దైవజనుడైన మోషే ముప్పై లక్షల కాల్బలము చుట్టూ ఉన్నారు, యుద్ధభూమిలో దేవుని మీద ఆధారపడి సూర్యుడా నీవు గిబియోనులో నిలువుము, చంద్రుడా నీవు అయ్యాలోనులో నిలువుము అని చెప్పగా సూర్య చంద్రులు నిలిచిపోయెను. అయితే యెహోషువ దైవజనుడైన మోషేను అడిగి ఈ మాటలు చెప్పలేదు గాని దేవుని ఆధారముగా చేసికొని ఆజ్ఞాపించెను. అమాలేకీయులను సమూలముగా ధ్వంసము చేయాలి చీకటి పడితే యుద్ధమును ఆపివేయాలి గనుక సూర్యచంద్రులను నిలిచిపొమ్మని యెహోషువ దేవుని ఆత్మ ప్రేరేపణతో, విశ్వాసముతో ఆజ్ఞాపించెను. మన జీవితములో కూడా దేవుని మీద ఆధారపడేవారముగా ఉండాలి. మనము దేవుని వాక్యమునకు లోబడి, దేవుని హృదయమంతటితో ప్రేమించి, శుద్ధ హృదయము నిర్మలమైన మనస్సాక్షి కలిగి ఉంటే అలాగు ప్రార్ధన చేయగలుగుతాము. మన మనస్సాక్షి మెలకువగా ఉంటే ప్రార్థించగలుగుతాము. మనస్సాక్షి చనిపోతే దేవుని మీద ఆనుకోలేము. దావీదు మనస్సాక్షి, యెహోషువ మనస్సాక్షి మేల్కొని ఉంది. యెహోషువ దేనికి సందేహించక దేవుని ఆధారముగా చేసికొని సృష్టిని శాసించెను. మనము కూడా దేవుని మీద ఆధారపడి గొప్పకార్యములను చూచుదము. అట్టి కృప దేవుడు మనకును అనుగ్రహించును గాక!

## ఆత్మల జాలరి

ఒక పర్యాయము బ్రెంగల్ తన పనిలో దూరప్రయాణము చేయవలసి వచ్చింది. తానెక్కిన రైలులో ఒక రంగస్థల నాటక బృందము కూడ ఎక్కింది. వారిలో చాలామంది యౌవనరాండ్రు ఉన్నారు. వారి వ్యర్థమైన మాటలనుబట్టి వారి ఆత్మీయ పేదరికము బ్రెంగల్‌కు అర్థమౌతున్నది. నైతిక విలువలు కుటుంబ జీవితములోని ప్రేమానురాగముల పట్ల వారి బలహీనమైన అవగాహన ఆయనకు దుఃఖమును కలిగిస్తున్నది. వారిని సంధించుటకు

ఒక అవకాశము కొరకు ఆయన ప్రార్థిస్తున్నాడు. ఆ రైలు పరిచారకుడు వారందరి బెర్తులను సర్దుతుండగా ఒక అమ్మాయి బ్రెంగల్ సీటు ప్రక్కన కూర్చున్నది. బ్రెంగల్ తనను తాను పరిచయం చేసికొంటూ వారి నాటకప్రదర్శనలను గురించి ప్రశ్నించాడు. వారు ఉదయం 10 నుండి 12 గంటల వరకు నాటక పునశ్చరణ చేసికొంటారు. మధ్యాహ్నం మ్యాటినీషో తరువాత సాయంకాలం 7:30 నుండి 11:30 వరకు రెండవ ఆట ప్రదర్శించిన తరువాత రాత్రి ఒంటిగంట వేళకుగాని నిద్రపోలేరు. బ్రెంగల్ ఆమె కుటుంబ జీవితమును గురించి ప్రశ్నించినప్పుడు రంగులు వేయబడిన ఆమె ముఖము వెనుక దాగిన దుఃఖము బయటికి వచ్చింది. ఆమెకు చికాగోలో బాగుగా కట్టబడిన మంచి ఇల్లు ఉన్నది కాని తన వృత్తి వలన కుటుంబ జీవితములో కూడ ఆమెకు విశ్రాంతి దొరకడము లేదు. బ్రెంగల్ ఆమెతో తన తల్లిని గురించి చెబుతూ ప్రేమనిండిన తల్లి ఏ రీతిగా నిజమైన విశ్రాంతినిచ్చే ఆశ్రయముగా ఉంటుందో ఆమె మరణానంతరము దేవునిలో తనకు అంతకు మించిన విశ్రాంతి ఏ రీతిగా లభిస్తున్నదో వివరిస్తుండగా, ఆమెకు జీవితము యొక్క అర్థము తెలియవస్తున్నది. ప్రయాసపడి తమ భారమును మోసికొనువారికి యేసే నిజమైన విశ్రాంతియని వివరిస్తూ ఆయన ప్రేమ, త్యాగము, మానవాళి కొరకైన ప్రాయశ్చిత్తము అన్నింటిని విపులీకరిస్తుండగా సమరయ స్త్రీ వంటి ఆమె కళ్లలో కన్నీరు సుడులు తిరుగుతున్నది. అలసిపోయిన నాటక బృందము రాత్రి మూడుగంటల వేళ తమ మజిలీ వచ్చినప్పుడు నిద్రపోతున్న బ్రెంగల్‌కు అసౌకర్యము కలుగకుండునట్లు చప్పుడు లేకుండా దిగిపోయారు. వారిని తాను ఎన్నడు తిరిగి చూడకపోవచ్చు కాని తాను దేవుని కొరకు ఒక ఆత్మను సంపాదించానని ఆయనకు తెలుసు.

యేసువలె జీవించు ఒక ఆత్మల జాలరికి సమయము అసమయము అంటూ ఉండవని బ్రెంగల్ తన జీవితము ద్వారా ఋజువు చేశాడు.

# ఏకాంత ప్రార్థన ప్రాముఖ్యత

**"చల్లపూటను ఆదామును అతని భార్యయు తోటలో సంచరించుచున్న దేవుడైన యెహోవా స్వరమునువిని, దేవుడైన యెహోవా ఎదుటికి రాకుండ తోటచెట్ల మధ్యను దాగుకొనగా దేవుడైన యెహోవా ఆదామును పిలిచి నీవు ఎక్కడఉన్నావనెను" ఆది. 3:8.**

ఆదాము హవ్వలను దేవుడు ఎంతో ప్రేమించెను. గనుకనే ప్రతిరోజు ఆయనే వచ్చి తోటలో సంచరించి ఆదాము హవ్వలతో గడిపెను.

**"నన్ను ప్రేమించువారిని నేను ప్రేమించుచున్నాను నన్ను జాగ్రత్తగా వెదకువారు నన్ను కనుగొందురు" సామెతలు 8:17**. నన్ను ప్రేమించువారిని నేను ప్రేమించుచున్నాను అని ప్రభువు సెలవిచ్చెను. మనం అసలు ఆయనను ప్రేమించలేదు. ఆయనే మనలను ప్రేమించెను. ఆదాము హవ్వలను దేవుడు ప్రేమించాడు గనుక వారిని వెదకుచున్నాడు. మన హృదయమును ఆయనకు ఎప్పుడు ఇస్తామా అని మన కోసము ఎదురు చూస్తున్నాడు. అదాము హవ్వలతో దేవుడు ప్రతిరోజూ వచ్చి మాట్లాడుతున్నాడు. మనం ప్రత్యేకించుకొని ఆయనతో ఏకాంతంగా గడపాలి. ఎప్పుడైతే మనం ఏకాంతంగా దేవునితో గడుపుతామో అపవాది యొక్క పన్నాగములు బద్దలు చేయబడతాయి. వీరు దేవుని తోటలో ఉన్నారు ప్రతిరోజూ దేవుని స్వరము వింటున్నారు. దేవుని సన్నిధిని అనుభవిస్తున్నారు కాని వీరు దేవుని ప్రేమించలేదు. దేవుని ప్రేమిస్తే దేవుని ఆజ్ఞను గైకొనేవారు.

**"మీరు నన్ను ప్రేమించినయెడల నా ఆజ్ఞలను గైకొందురు. నా ఆజ్ఞలను అంగీకరించి వాటిని గైకొనువాడే నన్ను ప్రేమించువాడు; నన్ను ప్రేమించువాడు నా తండ్రివలన ప్రేమింపబడును; నేనును వానిని ప్రేమించి, వానికి నన్ను కనబరచుకొందునని చెప్పెను" యోహాను 14:15, 21**

నన్ను ప్రేమించువారు నా ఆజ్ఞలు గైకొంటారు అని ప్రభువు సెలవిచ్చారు. దేవుడు ఆదాము హవ్వలను ప్రేమించాడు. దేవుడు మనలను

ప్రేమిస్తున్నాడు. మనలను ఆయన ప్రేమించడం కాదు గాని మనము ఆయనను ప్రేమించాలి. దేవుడు మనకిచ్చిన ఆజ్ఞను మనము గైకొనాలి. ఆదాము హవ్వలకు దేవుడు ఇచ్చిన ఆజ్ఞను గైకొనలేదు. ఆజ్ఞాతిక్రమమే పాపము. పాపము వలన వచ్చు జీతము మరణము. దేవుని వాక్యము వింటూ దేవుని ఆజ్ఞలను అతిక్రమించేవారిగా ఉంటే మన జీవితములలో దేవుని ప్రణాళిక నెరవేర్చబడదు. అపవాది పన్నాగములు బద్దలు చేయబడవు. దేవునితో ఏకాంతంగా గడిపితే అపవాది పన్నాగములు బద్దలైపోతాయి. మనము అపవాది ఎత్తుగడలను తుత్తునియలుగా చేయాలంటే దేవునితో ఏకాంతముగా గడపాలి. అలా గడిపేటప్పుడు దేవుని సన్నిధిని మనము అనుభవిస్తాము కృప పొందుకొంటాము. దేవుడు మనకు విశేషమైన జ్ఞానాన్ని ఇస్తారు. దేవుని సన్నిధిలో ఉంటే దేవుని పరిశుద్ధాత్మ శక్తి మనలోకి వస్తుంది. దేవుని ఆత్మ మనకు ఆయనయందు భయభక్తులు పుట్టిస్తుంది.

**"యెహోవా ఆత్మ జ్ఞానవివేకములకు ఆధారమగు ఆత్మ ఆలోచన బలములకు ఆధారమగు ఆత్మ తెలివిని యెహోవాయెడల భయభక్తులను పుట్టించు ఆత్మ అతనిమీద నిలుచును" యెషయా 11:2**

దేవుని ఆత్మ మనలో ఉన్నప్పుడు ఆయన నడిపింపును పొందుకొంటాము. ఆయన ప్రసన్నత కూడా అనుభవిస్తాము. ఆ పండు తినాలా లేదా? అనే విచక్షణా జ్ఞానము దొరుకుతుంది. దేవుడు ముందుగానే తినవద్దని చెప్పారు. అపవాది వచ్చి దేవుని ప్రణాళికలకు వ్యతిరేఖముగా వారితో మాట్లాడుతున్నాడు. నిన్ను నీవు ప్రత్యేకించుకొనకపోతే ఆ వివేచన నీకు ఉండదు. దేవుని బలము మనకు ఏకాంత ప్రార్థనలో దొరుకుతుంది. ఒంటరి ప్రార్థన లేకపోతే అపవాది నీలో పనిచేస్తాడు. ఎవరైతే దేవునితో ఒంటరిగా గడుపుతారో వారు పాపమును లోకమును జయించడానికి పరిశుద్ధంగా బ్రతకడానికి దేవుని యొక్క శక్తి దొరుకుతుంది. మనము అన్ని పనులు చేస్తాము గాని ఒంటరి ప్రార్థన మాత్రము చేయలేము. ఒంటరిగా రాత్రంతా ప్రార్థన చేయగలగాలి. ప్రభువు ఈ లోకములో ఉన్నప్పుడు

ప్రత్యేకించుకొనెను. ఆయనే మనకు మాదిరి. ఆరంభ దినములలో ప్రస్తుతము మందిరమున్న స్థలము (బుడంపాడు) లో దైవజనులు మూడున్నర సంవత్సరములు ప్రార్థించారు. ఇక్కడనే ప్రపంచ దర్శనము కొరకైన దేవుని వాగ్దానములు బయలుపరచబడెను. యౌవనుల కొరకు, సంఘము కొరకు వ్యక్తిగత జీవితముల కొరకైనా వాగ్దానములన్నియు ఈ ప్రార్థనలోనుండే వచ్చెను. నీవు ఒంటరి ప్రార్థన కలిగియుంటే గొప్ప ప్రత్యక్షతలు పొందుకొంటావు.

మన బలహీనతను పట్టుకొని అపవాది మన లోపలికి వస్తాడు అనే విషయము గుర్తుపెట్టుకోవాలి. నీవు ఏకాంత ప్రార్థనలో బలహీనమా? విశ్వాస విషయములో బలహీనమా? పరిశుద్ధతలో బలహీనమా? దేవుని ప్రేమించే విషయములో బలహీనమా? మన బలహీనత మీద దెబ్బకొట్టి మనలను ఉరిలోనికి ఉచ్చులలోనికి తీసికొని వెళతాడు. ఆదాము హవ్వలు దేవునికి చెప్పకుండా పండు తిని దేవుని మోసము చేసెను. ప్రేమ లేనప్పుడు చెప్పకుండా చేస్తాము. ఆదాము హవ్వలు దేవుని ప్రేమించలేదు గనుక వారు దేవుని మోసము చేసారు. దేవునితో గడిపే విషయములో వారు గ్రహింపులేనివారిగా ఉన్నారు. నన్ను వెదకువారికి నేను దొరుకుతానని ప్రభువు చెప్పారు. ఆయన నిన్ను వెదుకుచున్నారు నీవు ఆయనను వెదుకుతున్నావా? నీవు వెదికితే ఆయన ఆజ్ఞలను గైకొంటావు. ఎన్నడూ దేవుని మోసము చేయవు. ఆదాము హవ్వలు దేవుని మాటలను అతిక్రమించి అపవాదికి చోటిచ్చి అపవాది ఉచ్చుల్లోకి ఉరిలోకి వెళ్ళిపోయారు. మనము దేవుని పిల్లలము, దేవుని తోటలో ఉన్నాము అధికమైన కృప మన యెడల ఉన్నది. కల్వరి రక్తము మనలను కడగడానికి సిద్ధముగా ఉన్నది. మనము ఎక్కడ మోసము చేసాము? ఎక్కడ అన్యాయము చేసాము? దేవుని ఎక్కడ ప్రేమించలేకపోతున్నామో పరీక్షించుకొని పశ్చాత్తాపముతో దేవునితో ఏకాంతముగా గడిపినప్పుడు నిన్ను విడువక ఆయన లేవనెత్తుతాడు.

వారు దేవునితో ఏకాంతముగా గడపలేకపోయెను గనుక వారిలో యథార్థత లేదు అందుకే ఒప్పుకోలేకపోయారు ఏదేను తోటలో నుండి

నెట్టివేయబడ్డారు. ముఖము మాడ్చుకొనే స్వభావము నీలో ఉండకూడదు. అటువంటి వారికి పరలోకములో స్థానము లేదు. బాధపడేవారికి అసూయపడేవారికి కృంగిపోయేవారికి పరలోకములో స్థానము ఉండదు. నీలో అటువంటి స్వభావము ఉంటే పశ్చాత్తాపపడి సరిచేసుకో దేవుడు కృపనిస్తారు. మనము దేవునితో ఏకాంతముగా గడిపితే మన స్వభావాలు గుణపరచబడతాయి. ప్రభువు మనలను నూతన సృష్టిగా చేస్తారు. అంతేకాదు దేవుని సంకల్పములు బయలుపరచబడతాయి. అపవాది పన్నాగములను ఎత్తుగడలను సర్వాంగ కవచము ధరించుకొని తుత్తునియలుగా చేయుటకు దేవుని కృప మనకు దొరుకుతుంది. జీవిత కాలమంతా దేవునితో ఒంటరిగా గడపాలి. ఉగ్రత తీరిపోవువరకు గదిలోకి వెళ్ళి దాగియుండుమని వాక్యములో వ్రాయబడినది (యెషయా 26:21). మనము ఒంటరి ప్రార్థనలో గడిపి బహు తరములకు దీవెనకరముగా మార్చబడాలి. ఆదాము హవ్వలవలె దేవునికి లోబడకుండా మోసపుచ్చే ఆత్మ మనలో ఎవ్వరిలో ఉండకూడదు. మోసపోకుడి దేవుడు వెక్కిరింపబడడు మనము ఏమి విత్తుతామో అదే కోస్తాము. ఆదాము హవ్వలు అన్యాయము చేసారు శాపగ్రస్తమైనది కూర్చుకొన్నారు. అపవాది దేవుడు తినవద్దని చెప్పిన పండును తినుమని చెప్పినప్పుడు వారు వివేచించాలి గాని వారికి ఆ వివేచన లేదు కారణము ఏకాంత ప్రార్థన లేకపోవడమే. అందువలన దేవుని నడిపింపు మరియు మంచి చెడు విచక్షణా జ్ఞానము వారికి దొరకలేదు.

దేవుని బిడ్డలారా! దేవుని కృపను పొందుకొని ఏకాంతముగా దేవునితో గడుపుటకు మంచి తీర్మానము చేయుదము. దేవునితో సహవాసము నమ్మకమే అన్నింటిలో మనకు జయమిస్తుంది. నమ్మకముగా ప్రభువును సేవించడానికి ప్రత్యేకించుకొని అపవాదిని వాడియొక్క తలను తుత్తునియలుగా చేయడానికి పరిశుద్ధాత్మ దేవుడు మనకు సహాయము చేయునుగాక!

# నమ్మిక

నమ్మిక అనగా అంగీకారయోగ్యమైన సంపూర్ణసిద్ధి పొందిన విశ్వాసము. విశ్వాసమును గూర్చి ఎన్ని చెప్పినా విశ్వాసమును అభ్యసించుటలోను, క్రియారూపంలో ప్రదర్శించుటలోను కొంత కొరత ఉన్నది. అయితే నమ్మిక అనేది స్థిరమైన విశ్వాసము ఇది పరిపూర్ణంగా వికసించిన విశ్వాసము.

దేవుడు చేసే కార్యములను నమ్మిక వెంటనే చూస్తుంది. నమ్మిక విశ్వాంతరాళాలలోనికి దూసుకొనిపోయి కంటికి కనిపించని నిత్యమైన సంగతులను దృష్టిస్తుంది. దేవుడు కార్యాలను జరిగిస్తున్నట్లుగా అప్పటికే ఆయన వాటిని జరిగించినట్లుగా చూస్తుంది. నమ్మిక నిత్యమైన సంగతులను నిజజీవితంలోని వాస్తవ సంగతులుగా గుర్తిస్తుంది. నిరీక్షణను వాస్తవికమైన నెరవేర్పుగాను, వాగ్దానాన్ని ఇప్పటికే పొందుకున్న స్వాస్థ్యంగాను నమ్మిక మార్చుతుంది. మనం కళ్ళకు కనబడుచున్న వాటిని ఎలా నమ్ముతామో అలాగే మనం నమ్మిన వాటిని మన కళ్ళకు కనిపించేవిగా దృష్టిస్తాము. మనం స్పృహలో ఉన్నప్పుడు ఒక వస్తువును ఏలాగు తాకి దానిని గ్రహిస్తామో నమ్మిన వాటిని కూడా అలాగే గ్రహిస్తాము. నమ్మిక చూస్తుంది, పొందుకుంటుంది, హత్తుకుంటుంది. నమ్మిక తనకు తానే సాక్షి.

విశ్వాసం అనేకసార్లు దేవుని మంచితనాన్ని అర్థం చేసికొనుటలో బలహీనమౌతుంటుంది. విశ్వాసం అభివృద్ధి చెంది బలపడుటకు నిత్యత్వపు సంగతులను వాస్తవ జీవితంలోనికి తెచ్చుటకు విశ్వాసం ప్రార్థనా పూర్వకమైన విధేయతతో ఓపికతో వేచి ఉండాలి. అయితే నమ్మిక తాను నమ్మిన విషయాన్ని తన బలాన్నంతా ఉపయోగించి గట్టిగా పట్టుకుంటుంది. పోరాటాల్లో ఈ పట్టు మరింత దృఢపడి దేవుడు తన నిత్య జ్ఞానంతోనూ అనంతమైన కృపతోను తనకేంచేశాడో తనకు తానుగా గ్రహిస్తుంది.

శక్తివంతమైన ప్రార్థనలో వేచియుండుట ద్వారా విశ్వాసం అత్యున్నతమైన స్థాయికి చేరుకొని, దేవుని కృపావరంగా మారుతుంది. దేవుని సన్నిధిలో అలసట లేకుండా చేసే ప్రార్థనా మనవుల ద్వారాను ఆయనతో నిరంతరం చేసే సహవాసం ద్వారాను విశ్వాసం అత్యంత శక్తివంతమైనదిగా తయారవుతుంది. చారిత్రాత్మక వాస్తవాన్ని లేక గ్రంథములో లిఖించబడ్డ విషయాన్ని నమ్మడం సాధారణమైన విషయం అయితే ఒక వ్యక్తిపై నమ్మికయుంచుట అనునది నమ్మిక యొక్క నాణ్యతను పెంచి దాన్ని ఫలభరితంగా చేసి ఆ ఫలాలను ప్రేమతో నలుదిశలా ప్రకటించేలా చేస్తుంది. ప్రార్థనలోని నమ్మిక తన దృష్టంతా క్రీస్తుపైనే కేంద్రీకృతం చేస్తుంది.

నమ్మికను మన ప్రభువు ప్రార్థనకు పునాదిగా ఉంచెను. ప్రార్థనను వెన్నుతట్టి ప్రోత్సహించేది నమ్మికయే. క్రీస్తు పరిచర్యంతా తన తండ్రిపై పరిపూర్ణమైన నమ్మికతోనే కొనసాగింది. నమ్మికకు కేంద్రబిందువు దేవుడే. పర్వతాల్లాంటి కష్టాలూ ఇతరమైన ప్రార్థనా అవరోధాలు నమ్మికద్వారాను, నమ్మిన బంటుగా దానివెంట ఉండే విశ్వాసం ద్వారాను ప్రక్కకు నెట్టివేయబడతాయి. అనుమానానికి తావులేని నమ్మిక ఉన్నప్పుడు, ఇక ప్రార్థన కేవలం పొందుకునేందుకు బాగా చాపిన చెయ్యివంటిదే. నమ్మిక పరిపూర్ణత చెందినప్పుడు ప్రార్థన కూడా పరిపూర్ణత చెందుతుంది.

నమ్మిక తాను అడిగినదాన్ని పొందేందుకు ఎదరురుచూసి పొందుకొనును. నమ్మిక అనేది దేవుడు ఆశీర్వదించగలడని విశ్వసించడం కాదు గాని ఆయన ఇప్పుడే ఇక్కడే ఆశీర్వదించాడని నమ్మడం. నమ్మిక ఎల్లప్పుడూ వర్తమానకాలంలోనే పనిచేస్తుంది. నిరీక్షణ భవిష్యత్తువైపు చూస్తుంది. నమ్మిక ప్రస్తుతం వైపు చూస్తుంది. నిరీక్షణ ఆశిస్తుంది, నమ్మిక పొందుకొంటుంది. ప్రార్థన సంపాదించిన దానిని నమ్మిక స్వాధీనం చేసుకొంటుంది. అందుకే ప్రార్థకు కావలసిందల్లా అన్ని సమయాల్లోనూ స్థిరంగా నిలిచి వుండే సమృద్ధియైన నమ్మిక.

# దేవుని వాక్యమునకున్న శక్తి

అది 1905వ సంవత్సరము. బొలీవియాలోని ఆ గ్రామములో ఒక వ్యక్తి బైబిళ్ళను, క్రొత్త నిబంధనను అమ్ముతున్నాడు. బాలుడైన బల్టాడానో నల్లని అట్టతో కూడిన పాకెట్ సైజు క్రొత్త నిబంధనను కొనుకొన్నాడు. దానిలో కీర్తనల గ్రంథము కూడ కలిసి ఉన్నది.

మరుసటి దినమున గుడి గంటలు మ్రోగాయి. గ్రామ ప్రజలందరు అలవాటు ప్రకారము హుటాహుటిన ఆ గుడిలో సమకూడారు. బోధకుడు నిలబడి "ఒక దుష్టుడు ఈ ఊరిలోనికి వచ్చి బైబిల్ అని పిలువబడే ఒక చెడ్డ పుస్తకాన్ని విక్రయించాడు. కాబట్టి మీ దగ్గరనున్న బైబిళ్లన్నింటిని కాల్చివేయండి అని ఆజ్ఞాపించాడు. అతడు క్రైస్తవ బోధకుని ముసుగులో ఉన్న కరుడుగట్టిన కమ్యూనిస్టు. బల్టాడానో వెంటనే ఇంటికి వెళ్లి తన క్రొత్త నిబంధనను ఒక అరపైన పెట్టేశాడు. అది ఆ అరపై అలానే చాలా సంవత్సరాలు పడి ఉన్నది.

ఎదుగుతూ ఉన్న బల్టాడానో నెమ్మది నెమ్మదిగా పొగత్రాగడానికి అలవాటు పడ్డాడు. ఆ దేశములో పొగాకును పొడిగా చేసి ఒక పేపరులో చుట్టి సిగరెట్టును స్వంతంగా తయారుచేసుకుంటారు. ఒక దినమున అతడు ఇంటికి వచ్చిన తరువాత చూస్తే సిగరెట్టు పేపరు అయిపోయింది. ఏమి చేయాలా అని ఆలోచించుచుండగా తాను చిన్నప్పుడు కొనిన చిన్న పుస్తకము జ్ఞాపకమునకు వచ్చింది. అరపైనున్న ఆ క్రొత్త నిబంధనను తీసికొని మొదటి పేజిని చించివేశాడు.

తరువాత పొగాకు తీసికొని దానిని బాగా నలిమి ఆ పేపరు మీద వేసి సిగరెట్టు ఆకారంలో చుట్టాడు. ఆ పలుచని పేపరులో ఒక చక్కని సిగరెట్టు తయారయ్యింది. అప్పటినుండి అతడు క్రొత్త నిబంధనను పేజీల వారీగా చించివేస్తూ ఉండినాడు.

ఒక దినమున ఆయన అలా ఒక పేపరును చించి పొగాకును నలిపి ఆ పేపరు మీద వేయబోయాడు. అకస్మాత్తుగా అతని కళ్లు **"నశించిన**

**దానిని వెదకి రక్షించుటకు మనుష్యకుమారుడు వచ్చెను"** లూకా 19:10 అన్న మాటల మీద పడ్డాయి. బల్టాడానో పొగాకును ప్రక్కనపెట్టి మిగిలిన పేజీని చదివాడు. దానిని త్రిప్పి వెనుకవైపునున్న భాగాన్ని కూడ చదివాడు. అంతటితో ఆగక ఆ క్రొత్త నిబంధనను తీసికొని దానిని చదువనారంభించాడు. చీకటి పడినందున అతడు లేచి రెండు క్రొవ్వొత్తులను వెలిగించి చదవడం కొనసాగించాడు. క్రొవ్వొత్తులు కరిగిపోగా వేరే క్రొవ్వొత్తులను వెలిగించి ఆ రాత్రంతా చదువుతూనే ఉన్నాడు.

తూర్పునున్న ఉదయభానుడి రాకతో ప్రకాశించుచుండగా అతడు తన కుర్చీలోనుండి లేచి మోకరించి తన అరచేతులలో ముఖాన్ని పెట్టుకొని "క్రీస్తు ప్రభువా నా హృదయములోనికి రమ్ము, నా పాపములను క్షమించుము" అని మొఱ్ఱపెట్టాడు.

అల్పాహారము భుజించిన తరువాత కూడ ఆ చిన్న పుస్తకములోనున్న అద్భుతగాధను తంచుకొంటూ ఆశ్చర్యపడసాగాడు. తన దగ్గరున్న కొంచెము డబ్బును తీసికొని ప్రక్కనున్న పెద్ద గ్రామానికి బయలుదేరాడు. అక్కడ ఒక క్రొత్త నిబంధనను కొనుక్కోగలిగాడు. తాను సిగరెట్టుగా మార్చి పొగత్రాగిన మిగిలిన క్రొత్త నిబంధన భాగములైన మత్తయి, మార్కు, లూకా సువార్తలలోని మొదటి పద్దెనిమిది అధ్యయములను చదివేశాడు.

దేవుని వాక్యము పట్ల అతనికున్న ఆసక్తి అధికమై ఇతరులకు సాక్ష్యము చెప్పడం, దేవుని వాక్యాన్ని బోధించడం ప్రారంభించాడు. తరువాత బైబిల్‌ను కొనగలిగాడు. సత్యము బల్టాడానోను పట్టుకొన్నది. అతడు దానికున్న అతీతమైన శక్తి నుండి తప్పించుకోలేకపోయాడు. అంతకంతకు ఆత్మలో ఎదిగి తనకు తెలిసిన సత్యాలను ఇతరులకు బోధిస్తూ దేవుని సేవించసాగాడు. తరువాత అతడు అర్జెంటీనాకు వచ్చిన మిషనెరీలకు ప్రాంతీయ భాషను, సంస్కృతిని నేర్పించి సేవలో ఎంతో దోహదం చేశాడు.

RNI Regd.No.AP TEL/1998/ 6358 Postal Regd.No.GTR/64/2025-27

హోలి మినిస్ట్రీస్

# కన్వెన్షన్ - 2026

**ఏప్రియల్ 28 సా॥ నుండి మే 1 మ॥ వరకు**

**ప్రతిరోజు ఉ॥ 10-00 గం॥లకు మరియు సా॥ 6-30 ని॥లకు**

స్థలము : **బుడంపాడు, గుంటూరు**

**I**f undelivered please return to :

**Bro. DEEVANAIAH,** Editor,
*PARIPURNA VIDUDALA*
Horeb Prardhana Konda, **BUDAMPADU**
Etukuru - 522 017, Guntur Dist. A.P.
Phone : +91 7893823893

To,
Sri / Smt.

Edited, Published and owned by Bro. Chereddy Deevanaiah, Horeb Prardhana Konda, Budampadu - 522 017, Guntur Dist.
Printed by P. Srinivasa Rao, at Ushasri Graphics, Lalapet, Guntur, Ph : 2224257
Date of Posting : 4th & 5th of Every Month